

# పర్వ దీపం

తాళ్ళూరు నాగేశ్వరరావు

నేషనల్ హైవే నెంబర్ నైన్ రోడ్డు పక్కన యాభై మీటర్ల దూరంలో వుంది కనకదుర్గా క్రషింగ్ స్టోన్ ఫ్యాక్టరీ. దానికి అందిపుచ్చుకొనే దూరంలోనే మూలపాడు గ్రామం వుంది.

ఆ ఫ్యాక్టరీ ఇద్దరు భాగస్థులది.

కనకభూషణరావు కొండపల్లిలో వుంటాడు. అతనికి ఓ చిన్న ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ వుంది. మూడు బెంజి లారీలూ, నాలుగు లేలాండ్ లారీలూ, మరో రెండు 'ఫార్గో' పాతలారీలూ వున్నాయి. నేషనల్ హైవేస్‌లో కొండపల్లి జంక్షన్ దగ్గర ఓ లారీ సప్లయ్ ఆఫీసుకూడా వుంది. నాలుగు లారీలు ఎప్పుడూ నల్లరాయిని క్వారీల దగ్గర్నుంచి ఫ్యాక్టరీకి చేరవేయడానికీ, ఫ్యాక్టరీ దగ్గర్నుంచి రకరకాల మెటల్ చిప్స్‌ను విజయవాడా, ఆ పరిసర ప్రాంతాలకూ చేరవేయడానికీ తిరుగుతూనే వుంటాయి. పెద్దలారీలు మాత్రం లాంగ్‌రూట్స్‌లో సరుకులు చేరవేస్తూ వుంటాయి. అతని పార్టనర్ పార్థసారధి.

పార్థసారధి పుట్టిందీ, పెరిగిందీ ఆకునూరు అయినప్పటికీ తండ్రి హయాంనాటికే బెజవాడ చేరాడు. అతని తండ్రి సామారంగం చౌకు దగ్గర బొగ్గూ, కట్టెల అడితీపెట్టి ఆ రోజుల్లోనే వేలకువేలు సంపాదించాడు. హోగాకు బేరన్లకు బొగ్గును సప్లయ్ చేసేవాడు. గుండెజబ్బుతో ఆయన 'హరీ' అన్నాక, పార్థసారధి ఆ డబ్బును సొంతం చేసుకొని, ఆ వ్యాపారాన్ని గుమాస్తాతో కొనసాగిస్తూ, తన తెలివితేటలతో ఎన్నో ఇతర వ్యాపారాల్లోకి దిగాడు. కృష్ణలంకలో ఓ సినిమాహాలు లీజుకు తీసుకున్నాడు. ఒక మిత్రునితో కల్సి ఆఫ్‌సెట్ ప్రింటింగ్ ప్రెస్ పెట్టాడు. మరో మిత్రునితో కల్సి జిల్లాలవారీగా కొత్త, పాత సినిమాలు కొని ఆడించే డిస్ట్రిబ్యూషన్ సంస్థ పెట్టాడు.

పార్థసారధి, కనకభూషణరావూ— ఇద్దరూ చాలాకాలంనుంచీ ఫ్రెండ్స్. వారి స్నేహం మొదట జింఖానా క్లబ్‌లో ఒన్ టూ రమ్మీ ఆటలో మొదలైంది. ఒకరోజు పార్థసారధి పేకాటలో బ్యాంకుపోయి, జోకర్ రమ్మీ ఆటలో ఆల్ కౌంట్ పడగా రెండొందల పాయింట్లు బాకీపడ్డాడు. అతని దగ్గర డబ్బుల్లేవు. రేపు ఇస్తానని బతిమాలింపుగా చెప్పుకొని. ఆటనుంచి లేవబోయాడు. 'ఫర్వాలేదు. కూచోండి. పేకాటలో, రేసుల్లో, రాజకీయాల్లో గెలుపూ ఓటములు సర్వసామాన్యం. మరో రెండొందలు పాయింట్లు యిస్తా. ట్రైచేయండి. చేయి తిరగొచ్చు' అంటూ యిచ్చాడు కనకభూషణరావు. కాని పార్థసారధి దురదృష్టం ఆరోజు వెనకచూపు చూడలేదు. ఆ పాయింట్లు కూడా పోయాయి. మరునాడు సాయంత్రం క్లబ్బుకు రాగానే పార్థసారధి ఎనిమిదివందల రూపాయలు 'తాంబూలంలో పెట్టి' యిచ్చినట్టు ఇచ్చాడు. అతని నిజాయితీని కనకభూషణరావు మనస్సులో ఎంతో మెచ్చుకున్నాడు. మామూలుగా పేకాటలో తీసుకున్న అప్పు కృష్ణానదిలో ముడుపు కట్టి పారేసినట్లే. అలాంటిది మాట తప్పకుండా ఇచ్చాడంటే ఆ మనిషిలో నీతీ నిజాయితీ చెక్కుచెదరకుండా వున్నట్లే. అందుచేతనే అతను పార్థసారధితో ఆ తర్వాత స్నేహాన్ని పెంచుకున్నాడు, ఆ స్నేహం స్కాచ్ విస్కీకి స్పెన్సర్ సోడా అబ్బినట్టు, రమ్మీలో ఆల్ కౌంట్ షోకు స్వీక్వెన్స్ కార్డు వచ్చినట్టు, తాను బెట్‌చేసిన గుర్రం ఫోటోఫినిష్‌లో విన్నర్‌తో గెల్చినట్టు- అచిరకాలంలోనే అభివృద్ధి చెందింది. భాగస్వామ్య వ్యాపారానికి చేతులు కలిపింది. ఇద్దరూ కల్సి 'కనకదుర్గా క్రషింగ్ స్టోన్ ఫ్యాక్టరీ'ని స్థాపించారు - మూడు లక్షల మూలధనంతో.

కనకభూషణరావు మేనేజింగ్ పార్టనర్. అతనే ఎక్కువగా ఆ బిజినెస్ చూసుకుంటూ వుంటాడు. పార్థసారధి స్లీపింగ్ పార్టనర్ కాకపోయినప్పటికీ వొచ్చి మంచీ చెడ్డా కనుక్కుంటూ వుంటాడు.

ఆ రోజు ఉదయం సూర్యుడు రెండు ఫర్లాంగుల ఎత్తు ఎదిగాక. పార్థసారధి కారులో స్టోన్ క్రషింగ్ ఫ్యాక్టరీకి వచ్చాడు పార్టనర్‌ను కలుసుకోవడానికి. టెలిఫోన్ చేయగా కనకభూషణరావు ఫ్యాక్టరీలో వున్నట్టు తెల్సింది. ఫాక్టరీలో ఇంకా టెలిఫోన్ పెట్టించలేదు.

మూరంగా నిద్రగన్నేరు చెట్టుకింద నల్లరాయిని లారీలోంచి అన్‌లోడ్ చేస్తూంటే అక్కడ కనకభూషణరావు డ్రైవరుతో మాట్లాడుతున్నాడు. పార్థసారధి కారుచూసి క్రషింగ్ మెషిన్ దగ్గరకు బయల్దేరాడు.


ఫ్యాక్టరీ జోరుగా నడుస్తోంది.

పెద్దసైజు జా క్రషర్‌లో ముప్పావు అంగుళం చిప్స్ క్రష్‌అయి, బెల్ట్ కన్వేయర్ల ద్వారా జల్లెడలో పడుతోంది. యంత్రాలు ఆడుతున్నాయి. కన్వేయర్ బెల్టులు తిరుగుతున్నాయి. స్క్రీన్‌లోకి చిప్స్ పడుతున్నాయి. దుమ్మూ, దుబారా పొగలాగ పైకి లేస్తోంది. ఆ చుట్టు పక్కల ప్రాంతమంతా దట్టంగా మంచు పట్టినట్టుంది.

'ఫా' సెంటు చల్లిన జేబురుమాల్ని ముక్కుకు అడ్డంపెట్టుకొని, యంత్రాల హోరును భరిస్తూ గుట్ట ఎక్కి డిచ్ దగ్గర నిలబడ్డాడు పార్థసారధి. కన్వేయర్ బెల్ట్ పక్కనున్న మెకానిక్ దొరైస్వామి నమస్కారం పెట్టాడు చిన్న అయ్యగారికి. ఆ నమస్కారాన్ని స్వీకరిస్తూ ఇనుప బొచ్చెతో దుమ్ము దుబారాన్ని ఎత్తి చిన్న తోపుడుబండిలో పోస్తూన్న ఓ ముప్పైయేళ్ళ స్త్రీని చూశాడు పార్థసారధి. తలనుంచి గడ్డం కిందివరకూ నల్లగుడ్డ కట్టింది-ముక్కులోకి, నోట్లోకి దుమ్ముపోకుండా. బునుగు రంగు ముతకచీరపై, నల్లటి జాకెట్టు వేసుకుంది. అయిదున్నర అడుగుల ఎత్తులో తగినంత లావుతో బిగువు సడలని వొళ్లుతో మంచి స్ఫురద్రూపిగా వుంది. దేహం తీర్చిదిద్దినట్టుంది. మొహం పలకల గ్లాసులా వుంది; ముక్కు పదునుగా వుంది; కళ్లు పత్తి కాయలంత పెద్దవి; ఆ కళ్ళల్లో 'సెక్స్' సవాళ్లు వేస్తోంది! పండబట్టిన బుగ్గలు నిగనిగలాడుతున్నాయి; కంఠం గుండ్రంగా వుంది; కోనసీమ కొబ్బరి కాయల సైజులో వున్న రొమ్ములు ముందుచూపు చూస్తున్నాయి; ముడతలు పడిన నడుం వయస్సుకు సాక్ష్యం చెబుతోంది; జంట మంచాలకు సరిపడా వున్నాయి జఘనాలు. ఆమెను చూసిన ప్రథమ వీక్షణంలోనే పార్థసారధికి జయమాలిని, సిల్కుస్మితా, అనూరాధా సినిమా సెక్స్‌బాంబులు మనస్సులో మెదిలారు. కొన్ని క్షణాలపాటు దిగ్భ్రమ చెంది, పోత విగ్రహంలా వుండి పోయాడు.

"ఏంటి బాబూ!" అన్నాడు దొరైస్వామి చిన్నఅయ్యగార్ని ఈ లోకంలోకి తీసుకురావాలన్నట్టు.

ఆమె బొచ్చె ఎత్తుకోవడానికి కిందికి వొంగినప్పుడు బాడీలేని ఆమె రొమ్ములు మూడొంతులు కనపడ్డాయి. ఆమె



బొచ్చెను పైకి ఎత్తినప్పుడు పైట జారి పోయింది. చూపు మళ్ళించలేక పోయాడు నలభైయేళ్ల వ్యాపారి పార్థసారధి.

"ఎవర్రా?"

"అదాండి! కొత్తగా వచ్చింది. మా దేశం నుంచే తీసుకొచ్చా. సేలం దగ్గర ఓ చిన్నవూరు. మొగుడు లివర్ చెడిపోయి చచ్చాడు. వూళ్ళో ఒక్కతీ వుండలేక ఏదైనా పని చూపించమంటే వెంటబెట్టుకొచ్చా. దిట్టంగా పనిచేస్తాది దొరా. పెద్దయ్యగారు కనికరించి పనిలో పెట్టుకోమన్నారు. మాకాడోర గుడిసెల్లో వుంటాది." అన్నాడు దొరైస్వామి చేతులు నలుపుకుంటూ.


కనకభూషణరావు అక్కడికి రావడంతో ఆ సంభాషణను తుంచివేసి, షెడ్డులోకి వెళ్ళాడు పార్థసారధి. భాగస్థులిద్దరూ ఏవో వ్యాపార విషయాలు మాట్లాడుకున్నారు.

"భూషణం, నాకు అర్జంటుగా పది వేలు కావాలి. సోమవారం ఇస్తా." అన్నాడు పార్థసారధి.

"చెక్కు రాసిస్తా. బ్యాంకులో మార్చుకో" అన్నాడు కనకభూషణరావు సిల్కులాల్చీ పక్కజేబులోంచి చెక్కుబుక్కు తీస్తూ,

అతను చెక్కు రాస్తున్నంత సేపూ పార్థసారధి మనస్సు ఆమె చుట్టూ ప్రదక్షిణ చేస్తోంది. మళ్ళీ ఓసారి క్రషర్ దగ్గరకు వెళదామనుకొన్నాడు. కాని దొరైస్వామి ఏమనుకుంటాడో, భాగస్థుడు అనుమానిస్తాడోమో! అటుకేసి వెళ్ళకుండానే, చెక్కు పుచ్చుకొని కారెక్కాడు పార్థసారధి.

సేలం ప్రాంతాల నుంచి అయిదు కుటుంబాలతో తొమ్మిదేళ్ల క్రితం



వచ్చాడు దొరైస్వామి. ఆయనది చిన్న కుటుంబమే. కొడుకూ, కోడలూ. భార్య చనిపోయింది. కాని ఆయన తమ్ముడిది పెద్ద కుటుంబం. నలుగురు కూతుళ్ళు, ముగ్గురు అల్లుళ్ళూ, ఇద్దరు కొడుకులూ, కోడళ్ళూ. మేనమామ కొడుకుది ఇంకో కుటుంబం. మిగతా కుటుంబాలు ఆయన వూరినుంచి వొచ్చినవి పొట్టకూటికోసం. దేశంలో ఎక్కడికైనా కొంతమంది వలసపోతారు. అట్లాగే వచ్చాడు దొరైస్వామి. సొంతవూళ్ళో కొద్దిగా మెట్ట వుంది. వరుణదేవుడి దయాధర్మాలపై దానిమీద పంట పండుతుంది. ఒక్కోసారి మూడేళ్ల చాకిరీకి సగంపాలు ఫలసాయం రాదు. సేలంలో ఒక బాల్య స్నేహితుడి సాహచర్యంతో క్రషింగ్ మెషినరీమీద పని నేర్చుకున్నాడు. ఒకసారి మంగళగిరి నుంచి ఓ ఆసామి వచ్చి, ఆ స్నేహితుడ్ని తీసుకెళుతుంటే ఆ స్నేహితుడి సలహామీద దొరైస్వామి కూడ వచ్చాడు. అసిస్టెంట్ మెకానిక్‌గా వుంటూ, లేబర్ కాంట్రాక్టు పుచ్చుకున్నాడు. అయితే రెండు మూడు కంపెనీలు మారి, చివరకు కనకదుర్గా క్రషింగ్ ఫ్యాక్టరీలో మెకానిక్‌గా స్థిరపడ్డాడు. లేబర్ కాంట్రాక్టు సర్వీసును కొడుక్కి వదిలేశాడు.

దొరైస్వామి పెద్దమనిషి; లౌక్యుడు; లోకం పోకడ తెల్సినవాడు; యజమాని సేవకుడు అంతరాలు ఎరిగి మెలగే మనిషి; పరాయిచోట ఏ చిక్కులూ, ఛిద్రాలూ లేకుండా బ్రతకాలనుకొనే వ్యక్తి; సర్దుకుపోయే తత్వం గలవాడు. అందుచేతనే యజమాని తమను బానిస శ్రామికులుగా చూసినా, అడిగినప్పుడు అడ్వాన్సులు ఇవ్వకపోయినా, వేళకు మించి పని చేయించినా-దొరైస్వామి నోరెత్తేవాడు కాదు; నొసలు చిట్లించేవాడు కాదు. అట్లాంటిది దొరైస్వామి కొడుకు సేతురామన్ లేబర్ కాంట్రాక్టు పుచ్చుకున్నాక పరిస్థితుల్లో మార్పు వొచ్చింది.

సేతురామన్ తండ్రిలాంటివాడు కాదు. తరాల్లో వున్న తేడా అతనిలో వుంది. ముందుచూపు, లౌక్యం, విచక్షణాజ్ఞానం, సర్దుబాటు అలవాటు అతనిలో లేవు. తాము ఎక్కణ్ణుంచి వచ్చినా ఇక్కడ చేస్తున్నది శ్రమ. ఆ శ్రమకు ప్రతిఫలం దక్కాలి. ఆ శ్రమను యజమాని దోచుకోరాదు. ఆ శ్రమను దోచుకొని యజమాని మేడలూ, మిద్దెలూ కట్టరాదు. శ్రామికులు బానిసలు కాదు. ఆ భావనతో సేతురామన్ ఉడుకురక్తం కుతకుతలాడి, యజమానిపై ధ్వజమెత్తాడు. రోడ్‌రోడ్ బోల్డర్సు కొడితే తమకు వొచ్చేది ముష్టి మూటపదమూడు రూపాయలా! మధ్యలో కమీషన్ ఏజంట్‌కు ఇరవై ఏడు రూపాయలు లాభమా: డిచ్ దగ్గరా బెల్ట్ కన్వేయర్ దగ్గరా, స్క్రీన్ దగ్గరా దుమ్ము, దూగరా మధ్య పనిచేసేవాళ్ళకు రోజుకు ఏడు రూపాయల కూలా? మెకానిక్‌కు పన్నెండు రూపాయలూ, అసిస్టెంటు మెకానిక్‌కు తొమ్మిది రూపాయలు రోజువారీ వేతనాలా? రోజుకు పది గంటలు పనా? యజమాని ఇంటిదగ్గర ఇద్దరు మనుషులు వెట్టిచాకిరీ చేయాలా? అడ్వాన్సు అడిగినప్పుడల్లా సగానికి సగం కోతపెడతాడా? ఎవరికైనా జ్వరమొస్తే, ఆ మందు ఖర్చును యజమాని భరించడా? ఆ మధ్య ఓ కూలీ 'డిచ్'లో పడి కాలు విరగ్గొట్టుకుంటే, ముప్ఫై రూపాయలు నష్టపరిహారం చెల్లిస్తారా? లేబరు లీడర్‌గా ఈ విషయాలన్నీ ఒక రోజు కనకభూషణరావుతో నిర్మొహమాటంగా మాట్లాడాడు సేతురామన్.

కనకభూషణరావు మొహం నూనె పులిమిన నల్లరాయిలాగా మారింది. ఇంతకాలంగా బానిసలుగా, తన కాలి కింద చెప్పులాగా పడి, పనిచేసుకుపోతూన్న ఈ అరవకూలీలు ఈనాడు 'యజమానిని ఎదిరించడానికి ఆయత్తమయ్యారు. అందుకు సేతురామన్ నాయకత్వం వహించాడు. ఇది ఉపేక్షించాల్సిన విషయం కాదు. మొగ్గలోనే తుంచివేస్తే, పరిస్థితులు ముదురుపాకానికి రావు. కూలీల్ని ఎక్కడ వుంచాలో అక్కడ వుంచకపోతే, నెత్తికెక్కి నిలబడతారు'... అనుకున్నాడు కనకభూషణరావు. అందుచేత నిర్లక్ష్యంగా మాట్లాడాడు.

"మిమ్మల్ని ఆమాత్రం పోషించటమే గొప్ప, ఈ బిజినెస్‌లో ఇప్పటికే నష్టంతో గొంతుమటుకు మునిగాను. మీ గొంతెమ్మ కోర్కెల్ని తీర్చడం నావల్ల కాదు. పనిచేస్తే చేయండి. చేయకపోతే ఫ్యాక్టరీ మూసేస్తా."

సేతురామన్ నోరెత్తలేదు. కాని అతని నరనరాల్లో ఉడుకురక్తం ఉష్ణోగ్రత జరజరా పెరిగిపోయింది. యజమానికేసి తీక్షణంగా చూసి, వెనక్కి మళ్ళాడు.

ఆ తర్వాత నాలుగోరోజున కనక దుర్గా క్రషింగ్‌స్టోన్ ఫ్యాక్టరీలోకి పని చేయడానికి ఎవ్వరూ రాలేదు. ఉదయం తొమ్మిదిగంటలకు కనకభూషణరావు ఫ్యాక్టరీకి వస్తే - అంతా నిశ్శబ్దంగా వుంది. వాచ్‌మెన్‌ను అడగ్గా పన్లోకి ఎవ్వరూ రాలేదని చెప్పాడు. దొరై స్వామికి కబురుచేయగా, సేతురామన్ వచ్చాడు ముగ్గురు కూలీల్ని వెంటబెట్టు కొని.

"మీ అయ్యా-" కనకభూషణరావు అడుగుతూండగానే, "నేనే వచ్చాను" అన్నాడు సేతురామన్ ఖంగుమనే కంఠంతో.

కనకభూషణరావు ఎవ్వంత ఖంగు తిన్నాడు.

"ఇవాళ పన్లోకి ఎవరూ రాలేదా?"

"ఉహుం"

"అంతే!"

"రాదల్చుకోలేదు."

"ఏం?"

"మా కోర్కెల్ని మీరు ఖాతరు చేయలేదు. అంచేత పనికి ఎగనాం పెట్టేశాం."

"ఎన్నాళ్ళు పెడతారు?"

ఎన్నాళ్ళయినా సరే!"

"ఎద్దు అరుగెక్కితే, రైతు కాడిని మెడమీద వేసుకున్నాడట. అలా వుంది మీ ఎవ్వారం. అయితే నేను అంత పిరికివాణ్ని కాదు. మీ చావు మీరు చావండి. ఫ్యాక్టరీ మూసేస్తున్నాను" అన్నాడు కనకభూషణరావు తీవ్రమైన కోపంతో.

పార్ట్‌నర్ పార్థసారధితో మాట్లాడి నిజంగానే ఫ్యాక్టరీని మూసివేద్దామను కున్నాడు కనకభూషణరావు. అయితే పార్థసారధి వూళ్లోలేడు. మద్రాసు వెళ్లా డట. రెండ్రోజులకు గానీ రాడని తెలి సింది. ఏంచేయాలో తోచలేదు కనక భూషణరావుకు.

ఈ లోపుగా కనకభూషణరావును దిగ్భ్రమ చెందించే సంఘటన ఒకటి జరిగింది. ఆ మరునాడు పేపర్లో 'రాతి కార్మికుల వెట్టిచాకిరీ విముక్తి ఉద్యమం' అనే శీర్షిక కింద కనకదుర్గా క్రషింగ్ ఫ్యాక్టరీ కార్మికుల సమ్మె గురించి పది వాక్యాలు వచ్చాయి. ఈ వార్త పత్రికకు ఎక్కడంతో మిగతా స్టోన్ ఫ్యాక్టరీ యజమానుల్లో కలకలం పుట్టింది. కనక భూషణరావుకు ఫోన్లు చేశారు. ఎదురు చూడని ఈ వైపరిత్యానికి కనకభూషణ రావు కలవరపడ్డాడు. ఇదంతా సేతు


*With best compliments from*

# DECCAN QUEEN TRANSPORT

15-7-239 BEGUM BAZAR, HYDERABAD-500012

**Phone: 552982**

రామన్‌గాడు చేసిన అల్లరిని గ్రహించాడు. వాడి ఎముకల్లో సున్నం మిగలకుండా తన్నిద్దామనుకున్నాడు.

కాని ఆ సాయంత్రానికే కలక్టరుగారు స్వయంగా జీప్‌లో అక్కడికొచ్చాడు. మరో జీప్‌లో ఎస్.పి కూడా వచ్చాడు. మూలపాడు రోడ్డు పక్కనున్న గుడిసెల దగ్గరకెళ్ళి స్వయంగా స్టోన్ క్రషింగ్ కార్మికులతో వాళ్ళిద్దరూ మాట్లాడారు. కార్మికులు చెప్పేదంతా కలక్టరుగారి స్టెనో నోట్ చేసుకున్నాడు. తమ కడగండ్లను గోరంతలు కొండంతలు చేసి, ఆవేశంగా చెప్పాడు సేతురామన్.

ఆ తర్వాత కనకభూషణరావు దగ్గర స్టేట్‌మెంట్ తీసుకున్నారు. కూలీలచేత తాను వెట్టిచాకిరీ చేయించుకోవడం లేదనీ, వాళ్ళను న్యాయంగా, ధర్మంగా చూస్తున్నాననీ, పరిశ్రమలో ఉన్న రేట్ల ప్రకారమే వేతనాన్ని చెల్లిస్తున్నాననీ కనకభూషణరావు తెలియజేశాడు.

"సమ్మె విరమించి, కార్మికులు పనిలోకి రేపు వస్తారు. చేర్చుకుంటారా?" అన్నాడు ఎస్.పి.

"తప్పకుండా" అన్నాడు కనకభూషణరావు.

"వాళ్ళ కోర్కెల సంగతి."

"సముచితమైన కోర్కెల్ని తప్పకుండా తీరుస్తాను."

అందుకు సేతురామన్ ఒప్పుకున్నాడు తండ్రి ప్రోద్బలంతో. ఆ సమస్య ఆ విధంగా సద్దుమణిగింది. పార్టనర్ పార్థసారధి మద్రాసు నుంచి వచ్చినాక అన్ని విషయాల్ని వివరించి చెప్పాడు కనకభూషణరావు. చివరకు ఇలా అన్నాడు: "ఆ సేతురామన్‌గాడు ఆము పట్టిన కోడెగిత్త. వాడ్ని ఓ కంట కనిపెట్టి వుండాలి మనం. సమయం వచ్చినప్పుడు చావుదెబ్బ తీయాలి."

తల ఆడించాడు పార్థసారధి.

• • •

ఆరోజు పార్థసారధి క్రషింగ్ మెషినరీ స్క్రీన్ దగ్గర చూసినామె పేరు రమణి. ఆమెను వాస్తవానికి దొరైస్వామి కనికరించి తీసుకురాలేదు. సేతురామన్ తీసుకొచ్చాడట. కాకపోతే అతని సలహామీద రమణి పెద్దాయన్ని ప్రాధేయపడిందట లాంఛనప్రాయంగా. జాలిగుండె గల దొరైస్వామి, "వాచ్చేట్" అన్నాడట. ఆమెకూ, సేతురామన్‌కు శారీరక సంబంధం ఉన్నాయట. ప్రతి ఆదివారం వాళ్లిద్దరూ బస్సులో విజయవాడ వెళ్ళి, ఏ చవక బారు లాడ్జిలోనో కులికి పొద్దుపోయాక గుడిసెలకు చేరుకుంటారట. ఆ విషయం కనిపెట్టి సేతురామన్ భార్య మామకు ఫిర్యాదు చేస్తే, దొరైస్వామి రెండు మూడుసార్లు కొడుకును కఠినంగా మందలించాడట. అయితే సేతురామన్ ముసలాడి మాటల్ని అట్టే పట్టించుకోలేదట. ఈ సమాచారాన్నంతా పార్థసారధి ఆ కూలీల్లో ఒకడికి పదిరూపాయలిచ్చి సేకరించాడు.

"రమణి గుణం ఎలాంటిదిరా?" అన్నాడు పార్థసారధి ఆ కూలీతో.

"దాని గుణమేటిది బాబూ! లాడ్జీల్లో తిరిగే లంజ...ఎవడు పాతికిస్తే వాడికి వొళ్లు అప్పగిస్తాది. దానిమీద మోజుందేమిటి బాబుగారికి!... సెప్పండి. రాత్రికి ఎక్కడకు తీసుకురమ్మంటే అక్కడకు తీసుకొస్తా!" అన్నాడు వాడు పొగాకు కాడ నములుతూ.

తాను ఆశించిన దివ్యమైన వస్తువు వీధి అంగట్లో దొరికినంతగా సంబరపడ్డాడు పార్థసారధి. అతని ముందు రమణి అపూర్వ లావణ్య శోభతో, వొంటినిండా సెక్సుతో మూర్తీభవించిన మంత్రముగ్ధురాలిగా ఆ క్షణంలో మెదిలింది. పార్థసారధి పరవశత్వంతో పొంగిపోయాడు.

"విజయవాడ పట్టుకొస్తావా?"

"ఆఁ...ఎక్కడకు తీసుకురమ్మంటారు? లాడ్జిపేరు చెప్పండి అక్కడికి ఠంచన్‌గా తీసుకొస్తాను. రేపు ఆదివారం..."

పార్థసారధి ఆలోచనలో పడ్డాడు. ఆరోజు రాత్రి బస్సుకు కనకభూషణరావు ఏదో పనిమీద హైదరాబాద్ వెళుతున్నాడు. రెండ్రోజుల దాకా రాడు. కాబట్టి తాను ఏంచేసినా అతనికి తెలియదు. తర్వాత తెల్సినా తన అలవాట్లు ఎరిగినవాడు కాబట్టి ఏ మాత్రం పట్టించుకోడు. కాని...కాని...ఆ సేతురామన్‌గాడికి తెలిస్తే! ...... వాడు సహిస్తాడా?...

"మరి ఆ సేతురామన్‌గాడికి తెలిస్తే!" అన్నాడు పార్థసారధి సందేహంగా.

"తెలిస్తేమాత్రం ఏముంది బాబుగారూ! వాడు దీన్ని పోషిస్తున్నాడా, కడుపునిండా తిండి పెడుతున్నాడా? అది కూలిచేసుకుని దాని బతుకేదో అది బతుకుతున్నది. అప్పుడప్పుడు వాడి దాహాన్ని తీరుస్తున్నది. అంతే! వాడ్ని గురించి మీరు బెంగెట్టుకోకండి..."

మళ్ళీ పార్థసారధి ఆలోచనలన్నీ పరుగులు తీశాయి? విజయవాడలో ఎక్కడ? ఏ లాడ్జి? అప్పుడప్పుడూ లాడ్జీల్ని పోలీసులు రెయిడ్ చేస్తున్నారు ... ఖర్మచాలక పట్టుబడితే పరువూ, ప్రతిష్ఠా ఏలూరు కాలువ పాలవుతాయి ... ఏదైనా గెస్ట్‌హౌస్ బుక్‌చేస్తే! స్టేట్ గెస్ట్‌హౌస్, కెనాల్ గెస్ట్‌హౌస్, మున్సిపల్ గెస్ట్‌హౌస్, పోలీసు గెస్ట్‌హౌస్, పి.డబ్ల్యు.డి. గెస్ట్‌హౌస్ ... కేర్‌టేకర్‌కు పాతిక రూపాయలు పడేస్తే, ఒక రాత్రికి ఎకామిడేషన్ చూపెట్టకపోడు... కాని, అక్కడ ఎవ్వరైనా స్టేట్ ఆఫీసర్లు తటస్థపడితే!...మరి...




"అక్కడా ఇక్కడా దేనికండీ? మన ఫ్యాక్టరీ షెడ్డుందిగా! అందులో మంచ ముంది; దానిపై డన్‌లప్ బెడ్డుంది. అర్ధ రాత్రిపూట ఎవ్వరూ వుండరు. దాన్ని నేను తీసుకొస్తాను. షెడ్డుపక్కనే కాపలా వుంటాను. పని పూర్తయ్యాక దాన్ని గుట్టుచప్పుడు కాకుండా పంపేయొచ్చు ఏమంటారు?" అన్నాడా కూలివాడు.

ఆ పద్ధతి నచ్చింది పార్థసారధికి.

"నీ అయిడియా బాగుందిరా. అలాగే ఏర్పాటుచేయి."

"ఈ రాత్రికేనా?"

"మరి ఆలస్యం దేనికి?" అన్నాడు పార్థసారధి రమణిపొందుతో లభించే సుఖాన్ని అంచనా వేసుకుంటూ.

ఆ కూలివాడు చురుగ్గా తల ఆడించి, యాభై రూపాయలు బయానా పుచ్చుకొని రోడ్డెక్కాడు.

రాత్రి పదిన్నరకు విజయవాడ బస్సు స్టాండ్‌లో పార్ట్‌నర్ కనకభూషణ రావును హైదరాబాద్ వెళ్ళే సూపర్ డీలక్స్ బస్సు ఎక్కించి, ఎంబాసిడర్ కారులో ఫ్యాక్టరీకి బయల్దేరాడు పార్థ సారధి. గ్లాస్కో ధోవతిని లుంగీగా ధరించి, దానిపై చైనాసిల్కు లాల్చీ మెదోలినా ఫ్రెంచి పరిమళంతో రెపరెప లాడుతూండగా, త్రీ ఫైవ్ సిగరెట్టు వెలిగించి

పార్థసారధి కనకదుర్గా స్టోన్ క్రషింగ్ ఫ్యాక్టరీకి చేరుకోనే సరికి పద కొండూ పది అయింది. ఫ్యాక్టరీ ఆ చుట్టుపక్కలా నిర్మానుష్యంగా వుంది. రోడ్డుపక్కన గానుగ చెట్టుకింద నీడలో ఎంబాసిడర్‌కారు పెట్టి షెడ్డుదగ్గర కొచ్చాడు పార్థసారధి. దూరంగా మెషీన్‌దగ్గర, డిచ్ దగ్గర, ప్రహరీ కంచెదగ్గర, మెటల్ గుట్టదగ్గర విద్యు ద్దీపాలు కునికిపాట్లు పడుతున్నాయి. షెడ్డుదగ్గర లైటుమాత్రం వెలగడం లేదు. షెడ్డులోపల జీరోవాట్ ఎర్ర దీపం డేంజర్‌గా ఎర్రగా వెలుగుతోంది చీకటిమీద అధికారాన్ని చలాయిస్తూ.

షెడ్డుపక్కన బండమీద కూర్చున్న కూలివాడు అంత దూరంలోనే కంకర సేట్‌ను చూసి, తాగుతూన్న బీడీని అవతల విసిరేసి, "నమస్కారం సార్" అన్నాడు వినయంగా.

పార్థసారధికి ఆనందోద్రేకంతో ఆశ్చర్యం వేసింది.

"ఏరా. తీసుకొచ్చావా?"

"అవును బాబూ! షెడ్డులో వుంది— మీ కోసమే ఎదురుచూస్తూ."

పార్థసారధి వెనుకా, ముందూ, చుట్టు పక్కలా ఓసారి కలియజూసి, షెడ్డులో జొరబడ్డాడు——ఆనందసాగరంలోకి దిగుతూన్న తొందరపాటుతో.

షెడ్డులో ఎర్రదీపపు వెలుగులో తన ఎర్రని కోర్కెను ఎర్రగా తీర్చుకొని, అర్ధరాత్రి పన్నెండూ ఇరవైకి బయటకి వచ్చాడు పార్థసారధి, ఓ వంద రూపా యల కాగితాన్ని రమణి జాకెట్టు తొడు క్కుంటూండగా, ఆ జాకెట్టులో దోపి.

గానుగచెట్టు చీకటి నీడలోవున్న తెల్ల ఎంబాసిడర్‌కారు డోర్ 'కీ' తీసి, లోపల స్టీరింగ్ దగ్గర పార్థసారధి కూర్చోబోతుండగా——పక్కగా మరో చెట్టువాటునుంచి ఓక కత్తి వచ్చి విసు రుగా మోకాలికింద బలంగా గుచ్చు కుంది. "అబ్బా!" అంటూ పెద్దకేక వేసి, సీటు వెనక్కు జారగిలబడ్డాడు పార్థసారధి.

ఎదురుగ్గా ఓ కారు వస్తూన్న లైట్లు....

మరునాడు ఉదయం ఎనిమిదిన్నర గంటలకు సూర్యారావుపేటలో నాగ మల్లేశ్వరరావు నర్సింగ్‌హోమ్‌లో రెండో అంతస్తులో ఎయిర్‌కండిషన్డ్ రూమ్ బెడ్ మీద మెలకువ వచ్చిన పార్థ సారధి మనస్సులో రమణి అపూర్వ లావణ్యశోభ తళుక్కున మెరిసింది. కాని అంతలోనే మోకాలికింద ముల్లు గుచ్చుకున్న నొప్పి పుట్టడంతో, కట్టు కట్టిన కాలికేసి చూసుకున్నాడు. అప్పటికి గానీ అతనికి అర్థంకాలేదు...

